క్లుప్తంగా

అనారోగ్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారు


పాటి శివకుమార్

మలికిపురం: కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అనారోగ్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తపేట నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పాటి శివకుమార్ అన్నారు. ఆయన మలికిపురంలో ఆదివారం మాట్లాడుతూ ప్రభుత్వం సుమారు మూడు వేల కోట్ల బకాయిలను చెల్లించని కారణంగా ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసిన నెట వర్క్ ఆసుపత్రుల అంశంలో ఈ ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంపై కానీ ప్రజలు ఇబ్బందులపై గాని ఏమాత్రం ఆలోచన లేదనడానికి ఇదో నిదర్శనమన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకంపై తెలుగుదేశం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. 2019 నుంచి 2024 మధ్య మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు మూడు వేల జబ్బులు, ఒతర ప్రొసీజర్లను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చారన్నారు. ప్రతి ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న కుటుంబానికి 20 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఆరోగ్య భద్రత ఇవ్వడం జరిగిందని, ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఆరోగ్యశ్రీని తీసివేసి కేంద్ర ప్రభుత్వం హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టడం కోసం మొదటి నుంచి ఈ కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తూ వస్తుందన్నారు. దీని కారణంగా రాష్ట్రంలో పేద వర్గాల వారు ప్రమాదాల ద్వారా, అనారోగ్య సమస్యల ద్వారా ఆర్థికంగా వాళ్లకి భరోసా లేకపోవడం వల్ల ఎన్నో కుటుంబాలు రోదిస్తున్నాయని ఈ రోదన కచ్చితంగా ఈ కూటమి ప్రభుత్వానికి ఒక శాపంగా తగులుతుందన్నారు.

ఓపెన్‌స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఓపెన్ స్కూల్ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం చిరంజీవి

మామిడికుదురు: ఓపెన్ స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బొండాడ చిరంజీవి సూచించారు. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్లో ఆదివారం నుంచి పదో తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్ తరగతులు ప్రారంభమయ్యాయి. 14 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ ఓపెన్ స్కూల్లో చదువుకునే అవకాశం ఉందన్నారు. చదువుకోవాలన్న శ్రద్ధ ఉంటే ఏ వృత్తి వారు అయినా ఓపెన్ స్కూల్‌లో చదువుకునే అవకాశం ఉందన్నారు. పదో తరగతిలో 12 మంది, ఇంటర్‌లో 18 మంది ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బయ్యా మనోహరరాజు, టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

జనార్దనస్వామి ఆలయంలో యాత్రికుల సందడి

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో ఆదివారం యాత్రికుల సందడి నెలకొంది. నవ జనార్దనస్వామి ఆలయాల దర్శనంలో భాగంగా విశాఖపట్నం నుంచి ఆదివాకం ప్రత్యేక బస్సుల్లో వచ్చిన భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు కేవీఎస్ ప్రభాకరాచార్యులు మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రాచీన దేవాలయంగా ప్రఖ్యాతి గాంచిన జనార్దనస్వామి ఆలయ విశిష్టతను, క్షేత్ర మహత్యాన్ని భక్తులు అడిగి తెలుసుకున్నారు. సాధారణంగా నవజనార్దన దర్శన యాత్ర ధనుర్మాసంలో జరుగుతూ ఉంటుందని అయితే దీపావళి ముందుగానే భక్తులు తరలి రావడం శుభపరిణామమని ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఈఓ బి.నరేంద్రకుమార్ అన్నారు.

దేశభక్తే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావం

మామిడికుదురు: దేశభక్తి ప్రధాన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి క్రమశిక్షణ కలిగిన సంస్థగా దిగ్విజయంగా వందేళ్లు పూర్తి చేసుకుందని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు దాట్ల విజయరామరాజు, యుగంధర్, మైలవరపు రవిరామ్ పేర్కొన్నారు. లూటుకుర్రు కల్యాణం మంటపంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత సంవత్సరాల సమావేశం జరిగింది. ఆర్ఎస్ఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు యూనిఫారం ధరించి సమావేశంలో పాల్గొన్నారు. హిందూ సమాజం అనేక వందల సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న అయోధ్య రామాలయ నిర్మాణంలో అయోధ్య రామ పూజిత అక్షితలను ఇంటింటికీ చేరవేయడంతో సంఘ కార్యకర్తల కృషి అమోఘం అన్నారు. హిందూ ధర్మం కోసం, దేశం కోసం పని చేసే హిందువులను కలవడం కోసం ప్రతి గ్రామంలో శతాబ్ది కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పలువురు ప్రముఖులు సమావేశంలో పాల్గొన్నారు.



లూటుకుర్రు సమావేశంలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

కనుమరుగవుతున్న స్టాంపుల ప్రాభవం

- ఘనంగా తపాలా వారోత్సవాలు
- వివిధ స్టాంపుల సేకరణపై అవగాహన


ఏబీసీ దేవ్

కొత్తపేట: తంతి తపాలా శాఖ (పోస్టల్ డిపార్ట్‌మెంట్)లో స్టాంపుల పాత్ర ప్రాధాన్యం సంతరించుకుంది. కాలక్రమేణా సాంకేతిక విప్లవం విరాజిల్లుతున్న పరిస్థితుల్లో స్టాంప్స్ కనుమరుగవుతూ ప్రాభవాన్ని కోల్పోయాయి. ప్రస్తుత తపాలా వారోత్సవాల్లో భాగంగా ఆ శాఖ ఒకరోజు తపాలా బిళ్లల సేకరణ, వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్దేశించింది. తపాలా బిళ్లను మొట్టమొదటి సారిగా గ్రేట్ బ్రిటన్, ఐర్లాండ్‌లలో వాడినట్లు తెలుస్తోంది. ప్రజలకు 1840 నుంచి తపాలా బిళ్లలు (పోస్టేజ్ స్టాంప్స్) లేఖలు, మెయిల్ డెలివరీకి సహాయపడ్డాయి. 1835లో ఆంగ్ల ఉపాధ్యాయుడు, ఆవిష్కర్త, సంఘ సంస్కర్త రోలాండ్ హిల్ తపాలా కార్యాలయ సంస్కరణ కోసం ప్రచారం చేశాడు. 1837లో రోలాండ్ హిల్ మొదటి జిగురు తపాలా స్టాంపును కనుగొన్నాడు. ఒక పైసా ఖరీదు చేసే మొదటి తపాలా స్టాంపును రూపొందించాడు. అప్పటి నుంచి తపాలా స్టాంపుల చరిత్ర ప్రారంభమయింది. తద్వారా రోలాండ్ హిల్ తపాలా స్టాంపుల చరిత్రలో ఆవిష్కర్తగా గుర్తింపు పొందారు.



వివిధ రకాల పోస్టల్ స్టాంపులు

భారతదేశంలో 1852 జూలై 1న సింధ్ జిల్లాలో మొదలయ్యాయని తెలుస్తుంది. వీటిని ఈస్ట్ ఇండియా కంపెనీ ముద్రించేది. అన్ని తపాలా బిళ్లలు కోల్‌కతాలో ముద్రించబడేవి. తొలుత అన్నీ కూడా విక్టోరియా మహారాణి చిత్రంతోనే విడుదలయ్యేవి. తరువాత ప్రపంచ దేశాల నాయకులు, జాతీయ నాయకులు, చక్రవర్తులు, చరిత్రకారులు, ప్రముఖులు, జంతువులు, పరిశ్రమలు, వివిధ సంస్థలు, పర్వతాలు, ప్రాంతాలు, ప్రాజెక్టులు తదితర చిత్రాలతో ముద్రించిన స్టాంపులను రూపొందించారు.

స్టాంపుల సేకరణ'బుద్ధుడు'

సమాజంలో కొందరు అద్భుతమైన సేకరణలు జరుపుతుంటారు. ఆ సేకరణల్లో తపాలా బిళ్లలు (పోస్టు స్టాంప్స్) ఒకటి. కొందరు తమకు వచ్చిన కవర్లపై అతికించిన వాటిని. మరికొందరైతే ఎప్పటికప్పుడు విడుదలైన స్టాంపులను కొనుగోలు చేసేవారు. అటువంటి వారిలో కొత్తపేటకు చెందిన అద్దంకి బుద్ధచంద్రదేవ్ (ఏబీసీ దేవ్) ఒకరు. ప్రియదర్శినీ బాలవిహార్ కరస్పాండెంట్ అయిన బుద్ధుడు అనేకమైన అద్భుతమైన సేకరణల్లో భాగంగా అనేక దేశాలకు చెందిన తపాలా బిళ్లలను సేకరించారు. వాటిని ఆల్బమ్స్‌గా తయారుచేసి వాటిని తన విద్యా సంస్థలో విద్యా బోధనలో ఒక భాగంగా ఉపయోగిస్తారు. ఎంతో శ్రమించి సేకరించిన ఆయా స్టాంపులను విభజించి విద్యార్థులకు అర్థమయ్యేలా వాటిని విద్యాబోధనలో ఉపయోగిస్తున్న దేవ్‌ను తపాలా వారోత్సవాల సందర్భంగా 'సాక్షి' కలిసింది. స్టాంప్స్ సేకరణపై ఆయన ఆసక్తిని ప్రశ్నించింది. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. తన తండ్రి కేశవరావు నుంచీ తనకు స్టాంపుల సేకరణ అలవడింది. నా పదో ఏట నుంచి సుమారు 50 ఏళ్ల నుంచి సేకరిస్తున్నాను. సుమారు 900 స్టాంపులు నా వద్ద ఉన్నాయి. పోస్టల్ డిపార్ట్‌మెంట్ కొత్తగా విడుదల చేసిన వెంటనే ఆ స్టాంప్ కొనుగోలు చేయడం నా హాబీ. దాని గురించి, ఆ స్టాంప్ విడుదల వెనుక కారణాలను విద్యార్థులకు వివరిస్తాను. ఇలా నా విద్యా సంస్థలో అనేక అద్భుత సేకరణలు ఉన్నాయి.

కూటమి పాలన నకిలీమయం


కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు తదితరులు

నేడు నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ నిరసన

కొత్తపేట: రాష్ట్రంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కాదని, నకిలీ ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు విమర్శించారు. ఆదివారం సాయంత్రం డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ తదితరులతో కలసి విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే అతిపెద్ద మద్యం స్కాం కూటమి ప్రభుత్వంలోనే వెలుగు చూసిందని విమర్శించారు. ఇందులో సూత్రధారులు, పాత్రధారులు కూడా టీడీపీ నేతలేనని విమర్శించారు. నేటి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మద్యంతో ముంచెత్తుతూ మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని, అంతే కాకుండా నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తూ ప్రజల ప్రాణాలు హరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు సోమవారం నియోజకవర్గ స్థాయిలో కొత్తపేట ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తపేట మండలంతో పాటు రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల పార్టీ శ్రేణులు స్థానిక డేవిడ్‌రాజు స్వగృహానికి చేరుకోవాలని, అక్కడి నుంచి ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి తరలివెళ్లి నిరసన, వినతిపత్రం సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


అంబాజీపేటలో కొబ్బరితోట దున్నుతున్న రైతు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. అక్టోబర్ చివర వారంలోను, నవంబర్ నెలలో కొబ్బరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు ఇప్పటికే రైతులకు వివరించారు. వర్షాకాలం చివరిలో కొబ్బరి రైతులు దుక్కులు బాగా చేసుకోవాలన్నారు. హరిత ఎరువులైన జనుము, పిల్లిపెసర, నత్రజని స్థాపన మొక్కల విత్తనాలను తోటల్లో చల్లుకోవాలన్నారు. కొబ్బరి కాయలను ప్రతి నెలా క్రమం తప్పకుండా సరైన సమయంలో దింపు తీసుకోవాలన్నారు. వర్షానికి ముంపునకు గురైన తోటల్లో నీటిని బయటకు పంపాలన్నారు. వర్షాధారంపై ఉన్న కొబ్బరి తోటల్లో రెండో దఫా ఎరువులను కొబ్బరి చెట్టు చుట్టూ 2 మీ దూరం, 25 సెం.మీ లోతు పళ్లాలు చేసుకోవాలన్నారు. సిఫారసు చేసిన ఎరువులను వినియోగించాలన్నారు. పచ్చిరొట్టను కోసి కొబ్బరిచెట్టు పళ్లెంలో వేసుకోవాలన్నారు. ప్రతి రైతు వీటిని ఆచరించడం వల్ల కొబ్బరితోటలకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొబ్బరి చెట్లకు తెల్లదోమ ఆశిస్తుంది. దీనిని రైతులు తొలి దశలోనే గమనించి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి లేని పక్షంలో డిసెంబర్ నెలాఖరు నాటికి తెల్లదోమ ఉధృతి అధికంగా ఉండి కొబ్బరి పంటను నాశనం చేస్తుంది. తెల్లదోమ కనిపించిన కొబ్బరి తోటల్లో పిచికారీ చేయాలని అందుకు సంబంధించిన పురుగులు స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టేది సోషల్ మీడియానే..


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ జరిగిన వైఫల్యాలను ఎలుగెత్తేది, ఎండగట్టేది, ప్రజలకు చాటిచెప్పేది వైఎస్సార్ సీపీ సోషల్ మీడియానే అని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తొత్తరమూడి గన్నవరపు శ్రీనివాసరావు ఇంటి వద్ద ఆదివారం పి.గన్నవరం నియోజకవర్గం సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశం జరిగింది. కోఆర్డినేటర్ గన్నవరపు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఏమాత్రం అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. మొక్కుబడి పథకాలతో కాలం వెళ్లదీస్తుందన్నారు. ప్రజలకు ఇవన్నీ వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు అసలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. రహదారులు ఎక్కడ చూసిన అధ్వానంగా ఉన్నాయన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయన్నారు. కల్తీ మద్యం ఏరులై పారుతుందన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి నేతల నాని, కొత్తపేట పరిశీలకుడు పాటి శివకుమార్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, పి.గన్నవరం నియోజకవర్గం అధ్యక్షుడు దొమ్మేటి దుర్గారావు, అయినవిల్లి మండల అధ్యక్షుడు దాకారపు తులసీరామ్, పి.గన్నవరం అధ్యక్షుడు ఆకుమర్తి రమేష్, మామిడికుదురు అధ్యక్షుడు కాండ్రేగుల రమేష్, పొద్దుకు భద్ర, మోత ఫణీంద్ర, ఇల్లూరి వెంకటేష్, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టుపై దిగబడిన కారు


పెదపట్నం ఏటిగట్టుపై మట్టిలో దిగబడిన కారు

మామిడికుదురు: అర కిలోమీటరు దూరం ఉన్న ఏటిగట్టుపై పక్కా రోడ్డు నిర్మించాలని ఎంతో కాలం నుంచి ప్రజలు వేడుకుంటున్నా దాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పెదపట్నం గ్రామ ప్రజలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట నుంచి పెదపట్నం రత్నాపురం వెళ్లే మార్గంలో ఏటిగట్టుపై శనివారం రాత్రి మట్టిలో కారు దిగబడిపోయింది. రాత్రి సమయం కావడం, ఇక్కడ పరిస్థితులు తెలియక పోవడంతో స్థానికేతరులు కారులో వచ్చి ఏటిగట్టుపై మట్టి రోడ్డులో కారు దిగబడిపోయి దాన్ని అక్కడే విడిచి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. ఈ మార్గంలో మట్టి రోడ్డు స్థానే పక్కా రోడ్డు నిర్మించి ఇబ్బందులను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎంతో దగ్గరగా ఉండే ఈ మార్గంలో ఇప్పటికైనా రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు.

భారీ అన్నసమారాధన

ఆలమూరు: దేవీ నవరాత్ర ముగింపు మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని సంధిపూడి, పెదపళ్ల గ్రామాల్లో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు విచ్చేచి అమ్మవారి అన్నసమారాధన స్వీకరించారు. ఆలయానికి నిర్వహించిన విద్యుతీకరణ, విచిత్ర వేషధారణ, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆయా గ్రామాల్లోని దేవి మండపాల వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, భజన, కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

అంబాజీపేట: విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని పురస్కరించుకుని అంబాజీపేట శివారు కొత్తపాలెం హంస వాహన నిర్వాహకులు ఆదివారం భారీ అన్న సమారాధన ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సీతారాములకు, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 5 వేల మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు. చిరతపూడిలో కనకదుర్గమ్మ ఆలయంవద్ద అన్నసమారాధన నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మామిడికుదురులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: నలభై నాలుగేళ్ల క్రితం కలసి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్లో జరిగింది. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలసి అంతా ఒకచోట చేరి నాటి చిలిపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి మధుర స్మృతులను తలచుకుని మురిసిపోయారు. ఆటలు ఆడి, పాటలు పాడి ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు విద్య నేర్పిన గురువుల కృషి ఫలితంగానే తాము ప్రయోజకులం అయ్యామని చెప్పారు. అంతా ఓకే చోట కూర్చుని కుటుంబ సభ్యుల తరహాలో భోజనాలు చేశారు. స్కూల్ హెచ్‌ఎం బి.చిరంజీవి సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యక్కలదేవర బాలు, పొలమూరి సత్యనారాయణ, చిట్టూరి సుబ్రహ్మణ్యం, గంధం వెంకటరమణ, నయనాల రాధ, బొంతు అజయ్‌కుమార్, కశిరెడ్డి చల్లమ్మ పాల్గొన్నారు.

చింతం దంపతులకు ఘన సన్మానం


కొత్తపేటలో రిటైర్డ్ హెచ్‌ఎం సత్యప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కొత్తపేట: బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మోతుగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన చింతం వీరవెంకట సత్యప్రసాద్ సన్మానం ఆదివారం స్థానిక కాపు కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా సత్యప్రసాద్, వెంకటలక్ష్మి దంపతులు వివిధ సబ్జెక్ట్ టీచర్లుగా పనిచేసి, ఆయా సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. వారి విద్యా బోధన ఆదర్శనీయమన్నారు. అనంతరం సత్యప్రసాద్-వెంకటలక్ష్మి దంపతులను ప్రజాప్రతినిధులు, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, చింతం కుటుంబీకులు, బంధువులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సిద్ధంశెట్టి వీవీ సత్యనారాయణ, కొత్తపేట, ఆలమూరు ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, బి.అప్పాజీ, రిటైర్డ్ డీవైఈఓ పి.సాలెంరాజు, వీఆర్ఓ చింతం బాబ్జి, వివిధ మండలాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే


రావులపాలెంలో ఉత్తమ, నూతన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న శ్రీధర్

కొత్తపేట: సమాజానికి దిశ, దశ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ అన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన కాటూరు వంశీకిరణ్, ఎలక్కాయల మణికుమారి, బూర్ల భవాని, చిట్టూరి హిమబిందు, బట్టు శ్రీనుబాబు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు కేవీ శేఖర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు, గూడపాటి మాణిక్యాలరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. వారు ఏడుగురిని కప్పల శ్రీధర్ ఆధ్వర్యంలో రావులపాలెంలో ఆయన కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి పీఎస్ఆర్ జయపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట: మండలంలోని మోడేకుర్రు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మర్రి సత్యనారాయణ (60) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మోడేకుర్రు శివారు చినలంకకి చెందిన సత్యనారాయణ ఆదివారం రాత్రి ఇంటికి సమీపాన రోడ్డు పక్కనే నడచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు


శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేస్తున్న సుందర శ్రీనివాస్

అయినవిల్లి: శ్రీకృష్ణుడు కరుణామయుడు అందరినీ ఆయన సమాన దృష్టితో ఆశీర్వదిస్తారని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు ప్రభూజీ సుందర శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో శ్రీకృష్ణ ప్రభూజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడిని నిత్యం ఆరాధించాలని అన్నారు. ఆయన నామస్మరణ చేయాలన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని సుమారు 66 మంది లబ్ధిదారులకు ఆదివారం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.36.72 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు రాజోలు ఏరియా ఆసుపత్రి దూరంగా ఉండడం వల్ల గైనకాలజిస్టులు ఇక్కడ ఉద్యోగం చేయడానికి ఇబ్బంది పడుతున్నారని దీంతో ఇక్కడ వైద్య సేవలు అందడం లేదన్నారు. దీనిపై ఇప్పటికే కాంట్రాక్టు వైద్యులను సంప్రదించామన్నారు. ఇందులో ప్రసంగాలు ఎవరూ వక్రీకరించడానికి ఏమీ లేదని మన ఇబ్బందులు మనవని అన్నారు. సోమవారం నుంచి గైనకాలజిస్ట్ విధుల్లో చేరే అవకాశం ఉందన్నారు. లక్కవరంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కృషి చేస్తున్నానన్నారు. సమావేశంలో రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ముప్పర్తి నాని, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయాలి

ఆలమూరు: జిల్లాల పునర్విభజన జరుగుతున్నందున ఆలమూరు మండలాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ మండల ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. జొన్నాడ రైతు భవనం (పెద్ద కళ్యాణ మండపం) వేదికగా ప్రజా సంఘాలలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం అన్ని రంగాలు రాజమహేంద్రవరంతోనే అనుబంధం ఉండటంతో పాటు, జిల్లా కేంద్రమైన అమలాపురం దూరంగా ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కలిపే అంశాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు తగిన ప్రణాళిక రూపొందిస్తామని హెచ్చరించారు ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండలాన్ని తూర్పుగోదావరిలో కలపాలని తీర్మానాలు సేకరిస్తున్నామని ఈసందర్భంగా ఐక్య వేదిక నేతలు తెలియజేశారు. ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులకు త్వరలో వినతి పత్రాలు అందజేసి వారి మద్దతును కోరతామన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది సభ్యులతో జేఏసీ కమిటీని ఏర్పాటు చేసి, ఐదుగురు సభ్యులతో స్టీరింగ్ కమిటీని నియమించారు. ఐక్యవేదిక నేతలు ఆలమూరు మండలాన్ని తూర్పులో విలీనం చేయాలని నినాదాలు చేశారు.

వైభవంగా పల్లకి సేవ

రావులపాలెం: మండలంలోని గోపాలపురంలో మాండూ క్యోపనిషత్ పల్లకి సేవ ఆదివారం వైభవంగా జరిగింది. ట్రూత్ వివేకామృతం సంస్థ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక గురువు వివేకానంద పిలుపు మేరకు ఆధ్యాత్మిక వేత్త నల్లమిల్లి అమరజ్యోతి ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల మధ్య నిర్వహించిన మాండు క్యోపనిషత్ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మాండూ క్యోపనిషత్ గ్రంథాన్ని మానవాళి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని, ఊరూరా ఉత్సవాన్ని జరిపిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మాండూ క్యోపనిషత్ పల్లకి సేవకు హారతులు ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు.

వినాయక ఆలయానికి భక్తుల తాకిడి


విశేషాలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారుజామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు స్వామికి విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 107 మంది పాల్గొన్నారు. స్వామికి ఒక భక్తుడు ఉండ్రాళ్ల పూజ జరిపారు. ఇరువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. నలుగురు చిన్నారులకు అన్నప్రాశన జరిపారు. 11 మందికి తులాభారం నిర్వహించారు. శ్రీలక్ష్మీగణపతి హోమంలో 13 జంటలు, ఏడుగురు చిన్నారులకు తులాభారం నిర్వహించారు. స్వామికి ముగ్గురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 45 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2320 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,52,410 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.